క్లుప్తంగా

విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొందుర్గు: కొందుర్గు సబ్ స్టేషన్‌లో మరమ్మతు పనులు చేపడుతున్న కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆగిర్యాల, ఎదిర సబ్‌స్టేషన్లకు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏఈ పేర్కొన్నారు. ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు తమకు సహకరించాలని కోరారు.

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలికి సన్మానం



మొయినాబాద్: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలిగా నియమితులైన పామెన జ్యోతిని గౌడకుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రేనట్ల మల్లేష్‌గౌడ్ అభినందించారు. శుక్రవారం ఆయన శాలువాతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో మహిళల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. పార్టీ విస్తరణకు తమ వంతు సహకారం అందిస్తామని చెప్పారు.

ఆలయ ట్రస్టు సభ్యులకు దరఖాస్తులు

కొత్తూరు: మండలంలోని పెంజర్ల గ్రామంలో ఉన్న అనంత పద్మనాభస్వామి ఆలయ ట్రస్ట్ ఏర్పాటు కోసం దేవస్థాన పాలక మండలి శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి రామశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ట్రస్టులో సభ్యులుగా చేరేందుకు ఆసక్తి ఉన్నవారు జిల్లా దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో సత్తా

రాష్ట్ర స్థాయి పోటీలో మెరిసిన ఆలూరు విద్యార్థి



భరత్‌కుమార్‌ను అభినందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయుల బృందం

చేవెళ్ల: విద్యార్థులు చదువుతోపాటు సాంకేతికత పరిజ్ఞానం పొందటం ఎంతో ముఖ్యమని మండలంలోని ఆలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లీలారాణి అన్నారు. పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి భరత్‌కుమార్ వైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లా స్థాయిలో మొదటిస్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటాడు. ఈ మేరకు శుక్రవారం విద్యార్థిని ఉపాధ్యాయ బృందం అభినందించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈనెల 6 నుంచి 9వ తేదీ వరకు జడ్చర్లలోని ఎస్ఎస్ఐఎంఎస్ సెజ్ ప్రాంగణంలోని ఎస్‌వీకేఎం పాఠశాలలో జరిగిన వైజ్ఞానిక ప్రదర్శనలో భరత్‌కుమార్ పాల్గొన్నాడని తెలిపారు. అక్కడ ప్రతిభ సాధించడం గర్వకారణమన్నారు. భరత్‌కుమార్‌ను తీర్చిదిద్దిన ఉపాధ్యాయుడు అమర్‌చంద్‌లను ప్రత్యేకంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శారద, అమ్మనరావు, వీరప్ప, సుదర్శన్‌రెడ్డి, విజయగౌరి, మల్లారెడ్డి, జూనియర్ అసిస్టెంట్ అన్నపూర్ణ, ఎంఆర్‌సీ శంకర్, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

ఆర్యవైశ్య సంఘం షాద్‌నగర్ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌గుప్తా

షాద్‌నగర్: ఆర్యవైశ్య సంఘం షాద్‌నగర్ అధ్యక్షుడిగా మలిపెద్ది శ్రీనివాస్‌గుప్తా ఎన్నికయ్యారు. 2025–26 సంవత్సరానికి గాను పట్టణ ఆర్యవైశ్య సంఘం ఎన్నికలను నిర్వహించారు. అయితే అధ్యక్ష పదవి కోసం మలిపెద్ది శ్రీనివాస్‌గుప్తా ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. దీంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల నిర్వాహణ అధికారులు శరత్‌చంద్రబాబు, సరాపు జగదీశ్వర్‌లు ప్రకటించారు.

సమస్యలు పరిష్కరించాలని ఆశల వినతి

మీర్‌పేట: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని వేడుకున్నారు. ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కవిత, అధ్యక్షురాలు కవిత ఆధ్వర్యంలో శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆశవర్కర్లు మాట్లాడారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి నెరవేర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని వారు ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో సంఘం బాలాపూర్ మండల అధ్యక్షురాలు నీలావతి, ప్రధాన కార్యదర్శి తోట్ల భాగ్యలక్ష్మి, కోశాధికారి బి.సుజాత పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశి.. భక్తులు పరవశించి



మొయినాబాద్‌రూరల్: వేంకటేశ్వరస్వామికి పూలు తీసుకెళ్తున్న ఎమ్మెల్యే యాదయ్య

హరి నామస్మరణతో వైష్ణవాలయాలు మార్మోగాయి. వైకుంఠ ఏకాదశి(ముక్కోటి) పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం తెల్లవారుజాము నుంచే ఉత్తర ద్వార దర్శనానికి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో వేంకటేశ్వరస్వామి, నర్సింహాస్వామి తదితర ఆలయాలను విద్యుద్దీపాలతో చూడముచ్చటగా అలంకరించారు. మహిళలు, యువతులు సంప్రదాయ దుస్తులు ధరించి స్వామి వారిని దర్శించుకున్నారు. పలు చోట్ల స్వామివారి దర్శనానికి క్యూలైన్లలో భక్తులు వేచి ఉన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



కొందుర్గు: స్వామివారి పల్లకీ సేవలో భక్తులు



షాబాద్: సీతారామచంద్రస్వామి దేవాలయంలో భక్తులు



కొత్తూరు: అనంత పద్మనాభస్వామి ఆలయంలో భక్తుల రద్దీ



షాద్‌నగర్: వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దంపతులు



చేవెళ్ల: వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం

క్రీడలతో మానసికోల్లాసం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే శంకర్

కొందుర్గు: క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ప్రశాంతత చేకూర్చుతాయని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం రావిర్యాలలో ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లో యువత క్రీడా పోటీలు నిర్వహించడంలో ముందుంటాయని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కావలి రాజు, నాయకులు కృష్ణారెడ్డి, దామోదర్ రెడ్డి, ఆంజనేయులు, శివకుమార్, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

చర్చిలో ప్రార్థనలు

నందిగామ: ఏసుక్రీస్తు లోక రక్షకుడు అని, ఆయన బోధనలు ప్రపంచానికి ఆదర్శమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని చేగూరురెడ్డి కాలనీలో పునీత షారివారి చర్చి 77వ వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, నాయకులు నర్సింహాయాదవ్, శ్రీశైలం, సతీష్, హరినాథ్‌రెడ్డి, కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, సుదర్శన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పతంగులు ఎగరేయొద్దు

మొయినాబాద్: విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్‌ల వద్ద పతంగులు(గాలిపటాలు) ఎగురవేయడం ప్రమాదకరమని మండల విద్యుత్ ఏఈ హామునాయక్, లైన్‌మెన్ ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. సంక్రాంతి పండుగ సందర్భంగా గాలిపటాలు ఎగురవేసేటప్పుడు తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలను తెలియజేశారు. బహిరంగ ప్రదేశాలు, మైదానాల్లో మాత్రమే పతంగులు ఎగురవేయాలన్నారు. విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్‌లు ఉన్న చోట గాలిపటాలు ఎగురవేయవద్దని చెప్పారు. గ్లాస్ కోటింగ్ లేని కాటన్ మాంజాలు మాత్రమే వాడాలని.. నైలాన్, సింథటిక్ మాంజాలు వాడవద్దన్నారు. మెటాలిక్ మాంజాలకు కరెంటు పాస్ అవుతుందని.. అవి విద్యుత్ తీగలపై పడితే కరెంటు షాక్ కొట్టే ప్రమాదం ఉంటుందన్నారు. తేమ వాతావరణంలో పతంగులు ఎగురవేస్తే విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. పొడి వాతావరణంలోనే పతంగులు ఎగురవేయాలని సూచించారు. పతంగులు, మాంజాలు విద్యుత్ తీగలపై పడితే వాటిని వదిలేయాలని.. లాగితే విద్యుత్ తీగలు ఒకదానికొకటి తగిలి ప్రమాదాలు జరుగుతాయన్నారు. ఇళ్ల బాల్కానీలు, గోడల పైనుంచి పతంగులు ఎగురవేస్తే కింద పడిపోయే ప్రమాదం ఉంటుందన్నారు. పతంగులు ఎగురవేసేటప్పుడు తల్లిదండ్రులు తమ పిల్లలను జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలని సూచించారు.

బీజేపీతోనే పేదలకు మేలు

ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



చేవెళ్ల: బీజేపీలో చేరిన రామన్నగూడవాసులతో ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల: బీజేపీతోనే పేదలకు మేలు జరుగుతుందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని రామన్నగూడ గ్రామ నాయకుడు పెద్దళ్ల దయాకర్ తన అనుచరులతో కలిసి శుక్రవారం ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం సమక్షంలో బీజేపీ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. బీజేపీ అంటే ఒక నమ్మకమైన పార్టీగా ప్రజల్లో విశ్వాసం పొందిందన్నారు. రాబోయే రోజుల్లో తమ పార్టీదే అధికారమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విజయలక్ష్మీరమణారెడ్డి, నాయకులు పాండురంగారెడ్డి, అనంత్‌రెడ్డి, ప్రకాశ్, ప్రభాకర్‌రెడ్డి, శర్వలింగం, మానిక్యరెడ్డి, డాక్టర్ వైభవ్‌రెడ్డి, క్రిష్ణాగౌడ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన నాయకులు

శంకర్‌పల్లి: చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం సమక్షంలో శంకర్‌పల్లి బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మండలం, మున్సిపాలిటీలో పార్టీ అంతర్గత విషయాలు, కాంగ్రెస్ ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై చర్చించారు. అదే విధంగా మండల, మున్సిపల్ అధ్యక్షుల నియామకంపై చర్చలు సాగినట్లు సమాచారం. ఎంపీని కలిసిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు రాములుగౌడ్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, నర్సింహ, పరమేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

శంకర్‌పల్లి: మండల పీఆర్‌టీయూ టీఎస్ క్యాలెండర్‌ను శుక్రవారం శంకర్‌పల్లి ఎంఈఓ అక్బర్, పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డితో కలిసి స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. అనంతరం మండల విద్యాధికారి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు క్రమం తప్పకుండా పాఠశాలకు వెళ్లి, విద్యార్థులకు పాఠాలు చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మాణిక్యం, బాలరాజ్, సంజీవరావు, రమా, అర్జున్, నరహరి, నర్సింగ్‌రావు, మల్లికార్జున్, మల్లేశం, రవికాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత ఉండాలి

ఎమ్మెల్యే కాలె యాదయ్య



రోడ్డు కల్వర్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య తదితరులు

మొయినాబాద్‌రూరల్: ప్రభుత్వం రోడ్ల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందని, కాంట్రాక్టర్లు నాణ్యతతో పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఎన్కెపల్లి నుంచి బాకారం వరకు వారం రోజుల క్రితం ప్రారంభమైన పనులను ఆయన పరిశీలించారు. బాకారం సమీపంలో వాగుకు వేస్తున్న కల్వర్టును పరిశీలించి మాట్లాడుతూ.. కాంట్రాక్టర్లు నాణ్యతతో రోడ్డు పనులను పూర్తి చేయాలని, వీటిని అధికారులు పరిశీలించాలన్నారు. కొన్నేళ్ల నుంచి రోడ్డు పనులు అర్ధంతరంగా నిలిచిపోవడంతో వారం రోజుల క్రితమే ప్రారంభించామన్నారు. పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పీసీసీ కార్యవర్గ సభ్యుడు షాబాద్ దర్శన్, నాయకులు శ్రీనివాస్‌యాదవ్, అనిల్, రాములు, కృష్ణారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద మార్గం ఆదర్శనీయం

చేవెళ్ల: స్వామి వివేకానంద చూపించిన మార్గాలు అందరికీ ఆదర్శనీయమని ఏబీవీపీ చేవెళ్ల నగర అధ్యక్షుడు శ్రీశైలం, విభాగ్ కన్వీనర్ సూర్యప్రకాశ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మహిపాల్ అన్నారు. మండల కేంద్రంలోని సత్యసాయి పాఠశాలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వేడుకల్లో భాగంగా మండలంలోని విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏబీవీపీ అంటే కేవలం ఉద్యమాలను మాత్రమే కాదని యువతకు ఆదర్శంగా నిలబడేందుకు కావాల్సిన కృషిని అందిస్తుందన్నారు. వివేకానంద యువత చేతిలోనే దేశ భవిష్యత్తు ఉందని చెప్పాడన్నారు. వ్యాసరచన పోటీలతో పాటు యువత, విద్యార్థులకు ఈనెల 23 నుంచి 30వ తేదీ వరకు స్పోర్ట్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు నితీష్, శ్రీకాంత్, అరవింద్, కిషోర్, అనిల్, విజయ్, మల్లేష్, శ్రీకాంత్, హరీష్, విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

షాబాద్: విద్యార్థుల్లోని ప్రతిభా పాటవాలను పెంపొందించేందుకు వ్యాసరచన పోటీలు దోహదం చేస్తాయని షాబాద్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోవింద్ అన్నారు. శుక్రవారం పాఠశాలలో ముందస్తుగా వివేకానంద జయంతిని పురస్కరించుకుని మండలంలోని విద్యార్థులకు వివేకానంద పాదువు సంఘం ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు మల్లికార్జున్, రజనీకాంత్, చంద్రయ్య, గౌరీశ్వర్, రాము, ఉపాధ్యాయులు సుశీల, బాల్‌రాజ్, కరుణాకర్‌రెడ్డి, తదితరులున్నారు.

సంక్రాంతికి వెళ్తున్నారా జాగ్రత్త!

- ఇళ్లకు తాళాలు వేసి ఊరెళ్లే వారు ఠాణాలో సమాచారమివ్వాలి
- బంగారు, వెండి ఆభరణాలు, నగదు ఇంట్లో ఉంచుకోవద్దు
- విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి
- దొంగతనాల నివారణకు పోలీసుల సూచనలు



షాద్‌నగర్‌లో ఓ ఇంట్లో బీరువా ధ్వంసం చేసిన దొంగలు (ఫైల్)

షాద్‌నగర్: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని తమ ఆత్మీయులతో జరుపుకొనేందుకు అందరూ గ్రామాల బాట పడుతున్నారు. పండుగకు సెలవులు సైతం ఉండడంతో పిల్లలతో కలిసి కుటుంబమంతా సొంతూర్లలో గడిపేందుకు పయణమవుతున్నారు. ఈ నేపథ్యంలో ఇళ్లకు తాళం వేసి వెళ్లిన వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. లేదంటే దొంగలు చొరబడి లూటీ చేసే అవకాశం లేకపోలేదు. దొంగతనాలను అరికట్టడానికి తగు చర్యలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. పండుగవేళ ముందస్తు అప్రమత్తతతో చోరీలను కట్టడి చేయొచ్చని తెలుపుతున్నారు.

బ్యాంకుల్లో భద్రపర్చుకోవాలి



విలువైన నగలు, పత్రాలను బ్యాంకుల్లో భద్రపర్చుకోవాలి. ఊరెళుతున్న విషయాన్ని సోషల్ మీడియాల్లో షేర్ చేయొద్దు. అనుమానాస్పద వ్యక్తులు తిరుగుతుంటే 100కు డయల్ చేయండి.

– ప్రసాద్, సీఐ, నందిగామ

సమాచారం ఇవ్వాలి



ఇళ్లకు తాళాలు వేసి ఊరెళ్లే వారు తమకు నమ్మకమైన వారికి, పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలి. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని డీవీఆర్‌లను రహస్య ప్రదేశాల్లో ఉంచాలి.

– విజయ్‌కుమార్, సీఐ, షాద్‌నగర్‌టౌన్

వీటిని గమనించండి

- సెలవులకు ఊరు వెళుతుంటే కుటుంబ సభ్యుల్లో ఒకరిని ఇంట్లో ఉండేలా చూసుకోవాలి.
- ఎక్కువ రోజులు ఊళ్లకు వెళితే పక్కింటికి వారికి ఇంటి పరిసరాలను గమనించమని చెప్పాలి.
- ఇంట్లో విలువైన బంగారు, వెండి ఆభరణాలు, డబ్బును బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవాలి.
- బీరువాలకు సంబంధించి తాళాలు బట్టల కింద, ఇంట్లో పెట్టొద్దు.
- ఇంట్లో నమ్మకమైన వారిని మాత్రమే సెక్యూరిటీ గార్డుగా పెట్టుకోవాలి, నాసిరకం తాళాలు వాడొద్దు. సెంట్రల్ లాక్ సిస్టం ఉన్న తాళాలను అమర్చుకోవాలి.
- ఇళ్లకు తాళాలు వేసి వెళ్లే వారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలి.
- ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు తిరుగుతుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. లేదంటే 100 డయల్ చేయాలి.
- వాహనాలను ఇంటి ఆవరణలో పార్కు చేసి తప్పనిసరిగా తాళం వేయాలి. ద్విచక్రవాహనాల చక్రాలకు చైన్స్‌తో కూడిన లాక్ వేయడం మంచిది.
- ఇంట్లో సీసీ కెమెరాలను అమర్చుకొని వాటిని ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు చూస్తుండాలి. డీవీఆర్‌ను రహస్య ప్రదేశాల్లో భద్రపర్చుకోవాలి.

కేటీఆర్‌ను కలిసిన మాజీ జెడ్పీటీసీ



షాబాద్: బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను షాబాద్ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం నగరంలోని నందినగర్‌లోని ఆయన నివాసంలో కేటీఆర్‌ను కలిసి శబరిమల అయ్యప్ప ప్రసాదం అందజేశారు. ఆయనతో పాటు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యువ నేత పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి తదితరులున్నారు.

రంగవల్లులు.. సంప్రదాయానికి ప్రతీకలు

సంక్రాంతి సంబారాలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో అంబరాన్నంటాయి. చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లోని పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు సంస్కృతి సంప్రదాయాలపై అవగాహన కల్పించారు. పండుగలు ఆత్మీయులను మరింత దగ్గర చేస్తుందన్నారు. అనంతరం ముగ్గుల పోటీలు నిర్వహించారు. సత్తా చాటిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. పలు చోట్ల పతంగులు(గాలిపటాలు) ఎగుర వేసి కేరింతలు కొట్టారు.

– సాక్షి, నెట్‌వర్క్



షాద్‌నగర్‌రూరల్: ఎలికట్ట ప్రాథమికోన్నత పాఠశాలతో సంక్రాంతి సంబురాలు



కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ ఉన్నత పాఠశాలలో గాలిపటాలు ఎగరేస్తున్న విద్యార్థులు



షాబాద్: హైతాబాద్ ఉన్నత పాఠశాలలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు



షాద్‌నగర్: విఠ్యాల ప్రభుత్వ పాఠశాలలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

ఘనంగా స్వయం పరిపాలనోత్సవం



కొత్తూరు: విద్యార్థులు, గురువులు

మొయినాబాద్‌రూరల్/షాబాద్/కొత్తూరు: రోజూ పాఠశాలలో పాఠాలు వినే విద్యార్థులు ఉపాధ్యాయుల వెతలు తెలుసుకునేందుకు సిద్ధమయ్యారు. శుక్రవారం ప్రభుత్వ పాఠశాలల్లో స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్ పాఠశాలలో విద్యార్థులు ఒకరోజు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. షాబాద్ మండల పరిధిలోని సర్దార్‌నగర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు గురువులుగా మారి పాఠాలు చెప్పారు. కొత్తూరు పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు.



మొయినాబాద్‌రూరల్: అజీజ్‌నగర్ పాఠశాలలో..